క్లుప్తంగా

సత్య దీక్ష ప్రచారకుడికి సత్కారం



బూరుగుపూడిలో కృష్ణంబాబును సన్మానిస్తున్న సత్య స్వాములు

కిర్లంపూడి: మండలంలోని బూరుగుపూడిలో శనివారం సత్య దీక్ష ప్రచారకుడు నల్లమిల్లి కృష్ణంబాబును సత్కరించారు. గ్రామంలోని దుర్గమ్మ ఆలయంలో సత్య స్వాములు, గ్రామస్తులు కలిసి కృష్ణంబాబును శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సత్య స్వాములు మాట్లాడుతూ నిత్యం సత్యనారాయణస్వామి నామం జపిస్తూ ఎంతో మందితో సత్య దీక్ష వేయించడానికి కృషి చేస్తున్న కృష్ణంబాబును సత్కరించడం ఆనందంగా ఉందన్నారు.

రూ.60 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణం

తుని రూరల్: మండలంలో రూ.60 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మించేందుకు చర్యలు తీసుకున్నట్టు మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి.రవికుమార్ శనివారం తెలిపారు. ఈ నిధులతో మండలంలో ఎనిమిది పనులు చేసేందుకు ప్రతిపాదనలు చేశామన్నారు. ఇందులో నాలుగు పంచాయతీ రాజ్, మరో నాలుగు ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో చేపట్టాల్సి ఉందన్నారు. తొండంగి మండలంలో రూ.60 లక్షలతో ఎనిమిది పనులు, కోటనందూరు మండలంలో రూ.60 లక్షలతో 17 పనులను ప్రతిపాదించారు.

ఏపీ జేఏసీ జిల్లా కో చైర్మన్‌గా ప్రమీలారాణి



గోకవరం: ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల జేఏసీ సంఘం జిల్లా కో చైర్మన్‌గా రంప యర్రంపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం గంధం ప్రమీలారాణి నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం రాజమహేంద్రవరంలోని రెవెన్యూ భవనంలో శనివారం ఆమె ప్రమాణ స్వీకారం చేశారు. పలువురు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఆమెకు అభినందనలు తెలిపారు.

పశువుల షెడ్డు దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గండేపల్లి: మండలంలోని తాళ్లూరులో శనివారం పశువుల షెడ్డు దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే.. తాళ్లూరు గ్రామంలోని పాలకుర్తి రామచంద్రరావుకు చెందిన పశువుల షెడ్డుకు నిప్పు అంటుకుని రెండు కాటాల ధాన్యం, సైకిల్, ప్లాస్టిక్ గొట్టాలు, షెడుకు పైభాగంలోని వాసాలు కాలిపోయాయి. స్థానికుల సమాచారం మేరకు జగ్గంపేట అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం వాటిల్లింది.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



ఆలయ చైర్మన్ రోహిత్, ఏసీ రమేష్‌బాబుకు విరాళం చెక్కు అందజేసిన దాత

అన్నవరం: అన్నవరం సత్యనారాయణస్వామి నిత్యాన్నదాన పథకానికి సికింద్రాబాద్‌కు చెందిన ఓ దాత సత్య టెక్నాలజీస్ పేరు మీద రూ.లక్ష విరాళాన్ని శనివారం సమర్పించారు. ఈ మొత్తాన్ని దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, దేవస్థానం ఏసీ రమేష్‌బాబుకు అందజేశారు.

ఎస్‌ఈబీ దాడుల్లో ముగ్గురి అరెస్టు



స్వాధీనం చేసుకున్న సారా నిందితులతో ప్రత్తిపాడు ఎస్‌ఈబీ అధికారులు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ–సెబ్) పరిధిలో శనివారం నిర్వహించిన దాడుల్లో 20 లీటర్ల సారాతో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్టు స్థానిక సెబ్ సీఐ పి.అశోక్ తెలిపారు. కిర్లంపూడి మండలం వీరవరంలో ఐదు లీటర్ల సారాతో వనం శ్రీను, ఏలేశ్వరం మండలం సిరిపురంలో పది లీటర్ల సారాతో కోట భాగ్యం, ఐదు లీటర్ల సారాతో టేకుమూడి కృపావతిని అరెస్టు చేశామన్నారు. ఈ దాడుల్లో జిల్లా టాస్క్‌ఫోర్స్, ఇంటిలిజెన్స్ వింగ్ ఇన్‌స్పెక్టర్లు బి.వెంకటేశ్వరరావు, కె.గిరిధర్, సెబ్ ఎస్సై బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చివరిలో కలవరం

- మిచాంగ్ తుపాను ప్రభావంతో మారిన వాతావరణం
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- పంట ఒబ్బిడి పనుల్లో బిజీబిజీ



ధర్మవరంలో ఆదరాబాదరాగా వరి పనలను కుప్పలుగా వేస్తున్న కూలీలు



వేములపాలెంలో యంత్రాలతో వరి కోత



ఒమ్మంగిలో వరి కోతలు కోస్తున్న కూలీలు

ప్రత్తిపాడు/ప్రత్తిపాడురూరల్/తొండంగి: అన్నదాత ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికందే తరుణంలో వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో ప్రస్తుతం వరి పైరు కోత దశలో ఉంది. పలు గ్రామాల్లో వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మిచాంగ్ తుపాను రైతన్నలను కలవరపరుస్తోంది. తుపాను ప్రభావంతో ఇప్పటికే వాతావరణం మారిపోయింది. భారీ వర్షాలు కురిస్తే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

8 వేల ఎకరాల్లో..

ప్రత్తిపాడు నియోజకవర్గం వ్యాప్తంగా ఈ ఏడాది 8265 హెక్టార్లలో రైతులు వరి సాగు చేశారు. ప్రత్తిపాడు మండలంలో 3,300 హెక్టార్లలో, ఏలేశ్వరం మండలంలో 2,347 హెక్టార్లు, శంఖవరం 1,103 హెక్టార్లు, రౌతులపూడి 1515 హెక్టార్లలో వరి సాగు జరిగింది. రైతులు ఎక్కువగా ఎంటీయూ 1064, బీపీటి 5204, ఆర్‌జీఎల్ 2537, ప్రైవేటు రకాలైన రేవతి, సాధన, సంపద వంటి వంగడాలను సాగు చేశారు. ప్రస్తుతం వరి పంట తుది దశకు చేరుకుంది. ఇప్పటికే రబీ విత్తనాల కోసం సాగు చేసిన పొలాల్లో, కాస్త ముందస్తుగా సాగు చేపట్టిన గ్రామాల్లో కోతల ప్రక్రియ దాదాపు పూర్తయ్యింది. ఈ సీజన్‌లో ప్రభుత్వమే నేరుగా విత్తనాలు, ఎరువులు రైతు భరోసా కేంద్రాల ద్వారా విక్రయించడంతో తెగుళ్ల బెడద తక్కువగానే ఉంది. అక్కడక్కడ దోమ, ఎండాకు, మాగుడు తెగుళ్లు ఆశించినా వ్యవసాయాధికారుల సూచనలతో సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టడంతో అదుపులోకి వచ్చాయి. తెగుళ్ల బెడద తక్కువగా ఉండి పంట ఆశాజనకంగా ఉండడంతో మంచి దిగుబడులు వస్తాయని రైతులు గంపెడాశతో ఎదురు చూస్తున్నారు. ఈ తరుణంలో మిచాంగ్ తుపాను రైతుల ఆశలపై నీళ్లు చల్లుతోంది.

తుని నియోజకవర్గంలో...

రైతుల గుండెల్లో మిచాంగ్ తుపాను గుబులు పుట్టిస్తోంది. మండలంలోని పలు గ్రామాల్లో వరి పంట కోసి పనలపై ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

10 వేల హెక్టార్లలో సాగు

తుని నియోజకవర్గంలో ఈ ఏడాది 10 వేల హెక్టార్లలో రైతులు వరి సాగు చేశారు. కోటనందూరు మండలంలో 3845 హెక్టార్లు, తుని మండలంలోని 1766 హెక్టార్లు, తొండంగి మండలంలోని పంపా, పీబీసీ, చెరువులు, బోర్లు ఆయకట్టుల ప్రాంతాల్లో 4766 హెక్టార్లలో వరిసాగు జరిగింది. ఇప్పటికే వ్యవసాయ బోర్ల పరిధిలో రైతులు కోత కోసి పంటలను ఒబ్బిడి చేసుకున్నారు. ఆలస్యంగా వరి నాట్లు వేసిన ప్రాంతాల్లో పంట ప్రస్తుతం కోత దశకు వచ్చి ఉంది. ఈ తరుణంలో మిచాంగ్ తుపాను ప్రభావంతో వాతావరణం మారడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎక్కువ మంది రైతులు వరికోత యంత్రాలతో కోత కోయించి పంటలను ఒబ్బిడి చేస్తున్నారు. తొండంగి మండలంలో ఇప్పటి వరకూ 630 ఎకరాల్లో వరి కోతలు పూర్తయినట్టు వ్యవసాయశాఖ అధికారి ఎస్.నరసింహం తెలిపారు.

700 ఎకరాల్లో పనలపైనే పంట

వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులు అన్నదాతలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఇప్పటికే నియోజకవర్గంలో సుమారు ఎనిమిది వేల ఎకరాల్లో పంటను రైతాంగం ఒబ్బిడి చేసుకుంది. ప్రత్తిపాడు, రాచపల్లి, లింగంపర్తి, ధర్మవరం, శరభవరం, ఏలూరు, టి.రాయవరం తదితర గ్రామాల్లోని సుమారు 700 ఎకరాల్లో పంట పనలపైనే ఉంది. 300 ఎకరాల్లో పంట కళ్లాల్లో ఉండగా మరో 200 ఎకరాల్లోని పంటను కుప్పలుగా వేశారు. రైతులను వ్యవసాయ సిబ్బంది అప్రమత్తం చేసి పనలపై ఉన్న పంటను కుప్పలుగా వేయిస్తున్నారు. రైతులు యంత్రాల ద్వారా పంటను నూర్చి, ధాన్యాన్ని గొడౌన్లు, రైసు మిల్లులకు తరలిస్తున్నారు. పంట చేతికి అందివచ్చే సమయంలో తుపాన్లు, భారీ వర్షాలు కురిస్తే ఖర్చులు తడిసి మోపుడవుతాయన్న భయం రైతులను వేధిస్తోంది.

మూడున్నర ఎకరాల్లో వరి వేశాను



నేను మూడెకరాల పొలాన్ని కౌలుకు తీసుకున్నాను. దీంతో పాటు నాకున్న మరో అర ఎకరం పొలంలోనూ వరిసాగు చేశాను. ప్రస్తుతం అడపా దడపా వర్షాలు కురుస్తున్నాయి. పంట పంట కోయించాలో ? వాయిదా వేయాలో పాలు పోవడం లేదు. ఇప్పటికే దాదాపుగా రూ.లక్షన్నరకు పైగా పెట్టుబడి పెట్టాను. పంట దెబ్బతింటే తీవ్రంగా నష్టపోతాను.

–తొగర వెంకట రమణ, రైతు, తొండంగి

ధాన్యం సంచులు సిద్ధం



ఇప్పటికే మిచాంగ్ తుపాన్ నేపథ్యంలో రైతాంగాన్ని అప్రమత్తం చేశాం. పనల మీద ఉన్న పంటను కుప్పలుగా వేసుకోవాలి. కుప్పలపై టార్పాలిన్లు కప్పి ఉంచాలి. కళ్ళాల్లో ఉన్న ధాన్యాన్ని గొడౌన్లు, రైస్ మిల్లులకు చేర్చుకోవాలి. ధాన్యం నింపుకునేందుకు రైతు భరోసా కేంద్రాల్లో సంచులను సిద్ధం చేశాం. తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులకు వ్యవసాయ శాఖ సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటారు.

– యింటి వీర గంగాధర్, ఇన్‌చార్జి ఏడీఏ, జగ్గంపేట

ఓటు నమోదుకు ప్రత్యేక శిబిరాలు



ఏలేశ్వరంలో ప్రత్యేక శిబిరాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



జి.కొత్తపల్లిలో ఓటర్ల లిస్టులో తప్పులను సరిదిద్దుతున్న బీఎల్‌ఓలు

ఏలేశ్వరం: ఓటు నమోదుకు, ఓటరు జాబితాలో తప్పులు సరిదిద్దేందుకు రెండు రోజుల పాటు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శనివారం పట్టణంలో ప్రత్యేక ఓటు నమోదు శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఓటరు ఓటరు లిస్టులో ఎమైనా తప్పులు ఉంటే సరి చేసుకోవాలన్నారు. 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలన్నారు. స్థానిక కోనేటి బడిలోని క్యాంప్‌ను మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్, ఏఎంసీ డైరెక్టర్ పైల విజయ్‌కుమార్ పరిశీలించారు. ఎన్నికల సంఘం నిబంధనలు కచ్చితంగా పాటించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో దాసరి గణేష్, చందక కిరణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: నియోజకవర్గంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాల్లో భాగంగా రాచపల్లిలోనే అత్యధికంగా ఓటరు నమోదు జరిగిందని బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్, నియోజకవర్గ ఎన్నికల అధికారి ఎ.శ్రీనివాసరావు తెలిపారు. ప్రత్తిపాడు, ఒమ్మంగి, ధర్మవరం, రాచపల్లి గ్రామాల్లోని ఓటరు నమోదు ప్రత్యేక శిబిరాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాచపల్లిలో తొలి రోజు 31 మంది కొత్తగా ఓటు నమోదు చేసుకున్నారన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆదివారం కూడా నియోజకవర్గంలోని ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటరు నమోదుకు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. అర్హత కలిగిన యువతీ యువకులు ఓటు హక్కు నమోదు చేయించుకోవాలని కోరారు. తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ, బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

ఓటర్ల సవరణకు 1172 దరఖాస్తులు

తుని రూరల్: నియోజకవర్గంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక శిబిరాల్లో ఓటర్ల సవరణకు ఫారం 6, 7, 8 ద్వారా 1172 దరఖాస్తులు అందినట్టు తహసీల్దార్ ఎల్.శివకుమార్ తెలిపారు. తుని మండలంలో 365, తుని పట్టణంలో 220, కోటనందూరు మండలంలో 238, తొండంగి మండలంలో 349 దరఖాస్తులు అందాయన్నారు. వీరిలో పురుషులు 612, స్త్రీలు 560 మంది ఉన్నారని తహసీల్దార్ శివకుమార్ తెలిపారు.

ఓటే వజ్రాయుధం

శంఖవరం: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కే వజ్రాయుధమని తహసీల్దార్ కె.సుబ్రహ్మణ్యం అన్నారు. మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లోని శనివారం ప్రత్యేక ఓటు నమోదు శిబిరాలు నిర్వహించారు. ఓటర్ల లిస్టులో తప్పులను బీఎల్‌ఓలు సరిదిద్దారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటుహక్కు నమోదు చేయించుకోవాలన్నారు. ఈ నెల 9వ తేదీ వరకూ ఓటు హక్కు నమోదు చేసుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు.

అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి

ప్రత్తిపాడు రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని ప్రత్తిపాడు నియోజకవర్గ ఎన్నికల అధికారి ఎ.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని రాచపల్లి, ధర్మవరం, ఒమ్మంగి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను శనివారం ఆయన తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణతో కలిసి తనిఖీ చేశారు.

రౌతులపూడి: గ్రామాల్లో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవలని తహసీల్దార్ బి.భీమారావు సూచించారు. మండల వ్యాప్తంగా 48 పోలింగ్ కేంద్రాల్లో శనివారం నిర్వహించిన ప్రత్యేక ఓటు నమోదు శిబిరాల్లో 140 దరఖాస్తులు అందాయని తెలిపారు. ఆయా దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి ఓటుహక్కు కల్పిస్తామన్నారు.

వరి కోతలు వాయిదా వేయండి

శంఖవరం: మిచాంగ్ తుపాను ప్రభావంతో నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు వరి కోతలను వాయిదా వేయాలని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ సూచించారు. మండలంలోని కొంతంగి, నెల్లిపూడి గ్రామాల్లో వరి పంటలు, మాసూళ్లను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కోసి పనలపై ఉన్న వరి పంటను త్వరగా కుప్పలుగా వేసుకోవాన్నారు. నూర్చిన ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. రైతులందరూ త్వరగా పంటలను ఒబ్బిడి చేసుకోవాలని సూచించారు.



నెల్లిపూడిలో ధాన్యం రాశులను పరిశీలిస్తున్న ఏఓ గాంధీ

డ్రైన్ శిథిలం



గ్రంథాలయ భవనం ఎదురుగా డ్రైన్‌పై దెబ్బతిన్న శ్లాబ్ రాళ్లు

ఏలేశ్వరం: స్థానిక దిబ్బలపాలెంలోని గ్రంథాలయ భవనం ఎదురుగా ఉన్న డ్రైన్ శిథిలమైంది. డ్రైన్‌పై శ్లాబ్ రాళ్లు దెబ్బతినడంతో పాఠకులు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా గ్రంథాలయానికి వచ్చే చిన్నారులు, వృద్ధులు డ్రైన్ మీదుగా వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు డ్రైన్ శిథిలమవ్వడంతో మురుగునీరు నిల్వ ఉండిపోయి దుర్వాసన వస్తోంది. ఇటీవల గ్రంథాలయం సమీపం వరకూ డ్రైన్ నిర్మించి వదిలేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైన్ నిర్మాణం పూర్తి చేయాలని పాఠకులు కోరుతున్నారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేత



తుని ఏరియా ఆసుపత్రిలో రత్నానికి పింఛను అందిస్తున్న వలంటీరు బేబీ

తొండంగి: మండలంలోని ఏవీ నగరం గ్రామానికి చెందిన కండవల్లి రత్నం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి తుని ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె పింఛనుదారు కావడంతో గ్రామ వలంటీర్ కాకాడ బేబీ సొంత ఖర్చులతో శనివారం తుని ఏరియా ఆసుపత్రికి వెళ్లి రత్నానికి పింఛను నగదు అందజేసింది. సేవాభావంతో వ్యవహరించిన వలంటీర్ బేబీని తుని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొయ్యా మురళీకృష్ణ, పంచాయతీ కార్యదర్శి బి. ప్రేమకుమార్ అభినందించారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



అచ్యుతాపురంలో పూడిక తీత పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ జగదాంబ

గోకవరం: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని లబ్ధిదారులకు మండల ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ జగదాంబ సూచించారు. మండలంలోని కొత్తపల్లి జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను శనివారం ఆమె పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.

జనవరి నెలాఖరు నాటికి ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం కామరాజుపేట గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్‌లో క్రీడా మైదానాన్ని పరిశీలించారు. అచ్యుతాపురంలో చెరువుల్లో పూడికతీత పనులను పరిశీలించి సిబ్బంది పలు సూచనలు చేశారు. ఆమె వెంట ఎంపీడీఓ కె.పద్మజ్యోతి, ఏఓ కిశోర్‌కుమార్, ఏపీఓ పీఎస్ అప్పలరాజు, కార్యదర్శి చిన్నకుమార్ రెడ్డి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

యువతకు వాలీబాల్ కిట్ల పంపిణీ



దానవాయిపేటలోయువతకు వాల్‌బాల్ కిట్లు అందించిన దివీస్ ప్రతినిధులు

తొండంగి: మండలంలోని దానవాయిపేటలో యువతకు శనివారం దివీస్ ల్యాబోరేటరీస్ ఆధ్వర్యంలో వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. గ్రామంలోని యువతకు రూ.75 వేల విలువ చేసే వాలీబాల్ కిట్లను దివీస్ కంపెనీ మేనేజర్ సుధాకర్ అందజేశారు. యువత క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో దివీస్ ప్రతినిధులు వాసుబాబు, వార్డు సభ్యుడు బొక్కా భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం వినియోగంపై అవగాహన అవసరం



కోటనందూరులో ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



కృష్ణునిపాలెంలో ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న రెవెన్యూ సిబ్బంది

కోటనందూరు: ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం) వినియోగంపై ప్రతిఒక్కరికీ అవగాహన అవసరమని ఈఆర్‌ఓ, కాకినాడ సెజ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఏవీఎస్ఎన్ మూర్తి అన్నారు. స్థానిక గ్రామ సచివాలయం–1లో శనివారం నిర్వహించిన ఈవీఎం వినియోగంపై అవగాహన శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఓటర్లంతా పోలింగు బూత్‌లో ఓటు వేసే విధానాన్ని నిశితంగా పరిశీలించాలని సూచించారు. మాస్టర్ ట్రైనర్ వి.నాగేశ్వరరావు ఈవీఎంలో అభ్యర్థుల పేర్లు, గుర్తులు, వీవీ ప్యాట్‌లు, ఓటు ఎలా వేయాలి తదితర అంశాలపై ఓటర్లకు అవగాహన కల్పించారు. మండలంలోని టీజే నగరం, బొద్దవరం, కోటనందూరు, కాకరాపల్లి గ్రామాల్లో ఓటు నమోదు ప్రత్యేక శిబిరాలను ఈఆర్వో మూర్తి తనిఖీ చేశారు. ఓటు నమోదు, తొలగింపు, మార్పులు, చేర్పుల్లో ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలని బీఎల్‌ఓలకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.కుశరాజు తదితరులు పాల్గొన్నారు.

గోకవరం: మండలంలోని కృష్ణునిపాలెంలో శనివారం ఈవీఎంల వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక రామాలయం వద్ద ఈవీఎం మెషీన్ ద్వారా ఓటు వేసే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటు వినియోగం, వీవీ ప్యాట్ తదితర అంశాలను ప్రజలకు వివరించారు.

రేపు జాబ్‌మేళా

గోకవరం: స్థానిక కోర్ల వీరాస్వామి (కేవీఎస్) డిగ్రీ కళాశాలలో సోమవారం కేవీఎస్ డిగ్రీ కళాశాల, వికాస ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీవీవీ ప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ట్రైనీ, కోజెంట్ ఇ సర్వీసెస్‌లో బీపీఓ, డిక్సాన్, సియోన్ ఇ–డబ్ల్యూఏ సుమిత్, ఇసుజు మోటార్స్ కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ డిప్లొమో, బిటెక్, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై 35 సంవత్సరాల లోపు యువతీయువకులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు సోమవారం ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 98852 70488 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

సందడిగా వనసమారాధనలు



తుని వనసమారాధనలో పాల్గొన్న రోటరీక్లబ్ ప్రతినిధులు



అడ్డురోడ్డు వనసమారాధనలో దాత హరీష్‌ను సన్మానిస్తున్న యూత్ కమిటీ సభ్యులు

తుని: స్థానిక రోటరీక్లబ్ ఆధ్వర్యంలో కార్తిక సంబరం –2023 పేరుతో శనివారం వన సమారాధన నిర్వహించారు. రోటరీ క్లబ్ సభ్యులంతా కుటుంబ సమేతంగా వచ్చి ఆటపాటలతో సందడి చేశారు. పరస్పరం కష్టసుఖాలు చెప్పుకుంటూ రోజంతా ఉత్సాహంగా గడిపారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. రోటరీ క్లబ్ ప్రతినిధులు, ఇన్నర్ వీల్ సభ్యులు, రోటరాక్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: మండలంలోని లింగంపర్తిలో శనివారం కార్తిక వనసమారాధన నిర్వహించారు. గ్రామంలోని రామాలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వందలాది మందికి అన్నదానం చేశారు. మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు పాల్గొన్నారు.

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు శివాలయం ఆవరణలో శనివారం కార్తిక వన సమారాధన నిర్వహించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఒబిణ్ని వీరబాబు ఆధ్వర్యంలో వనసమారాధన ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో అయ్యప్పమాలధారులు, భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. తొలుత ఉసిరిచెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు కాపు ఉపాధ్యాయుల వనసమారాధన

గోకవరం: ఆంధ్రప్రదేశ్ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తూర్పుగోదావరి జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం రాజమహేంద్రవరం లాలా చెరువులోని పుష్కరవనంలో కార్తిక వనసమారాధన నిర్వహించనున్నట్టు సంఘం గౌరవాధ్యక్షుడు చేబ్రోలు చలం, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోపిశెట్టి బంగారాజు, మద్దాల అప్పారావు శనివారం తెలిపారు. శనివారం వారు గోకవరం మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులను వనసమారాధనకు ఆహ్వానించారు. కాపు ఉపాధ్యాయులంతా తప్పనిసరిగా హాజరై విజయవంతం చేయాలన్నారు.

ప్రత్తిపాడు రూరల్: అడ్డురోడ్డు జంక్షన్‌లోని మామిడి తోటలో శనివారం ప్రత్తిపాడు గ్రామస్తులు కార్తిక వన సమారాధన నిర్వహించారు. తొలుత భక్తులు ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ వాటి నిర్వహణకు ఆర్థిక తోడ్పాటును అందిస్తున్న రాజుపాలెం గ్రామానికి గొడే హరీష్‌ను ఘనంగా సన్మానించారు.

రౌతులపూడి: మండలంలోని ములగపూడిలో శనివారం కార్తీక వనసమారాధన నిర్వహించారు. మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సీహెచ్‌వీవీ సత్యన్నారాయణ ఆధ్వర్యంలో గ్రామ శివారున మామిడితోటలోని అన్నదానం ఏర్పాటు చేశారు. వందలాది మంది భక్తులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.

వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి

కిర్లంపూడి: వచ్చే ఎన్నికల్లో విజయానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు సూచించారు. మండలంలోని వేలంకలో వైఎస్సార్ సీపీ నాయకుడు దోమాల గంగాధర్ నివాసంలో శనివారం పార్టీ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై ఆరా తీశారు. అనంతరం పుట్టినరోజు వేడుకలు జరుపుకుంటున్న గంగాధర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, జెడ్పీటీసీ సభ్యులు తోట గాంధీ, సొసైటీ అధ్యక్షుడు చదలవాడ బాబీ, అడబాల శ్రీను, గండే నాని పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు

తొండంగి: జాతీయ రహదారిపై మండలంలోని బెండపూడి ఆర్‌టీఏ చెక్‌పోస్టు వద్ద ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఆటోను ఢీకొట్టిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు తొండంగి ఎస్సై జి.వెంకటేశ్వరరావు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. బెండపూడికి చెందిన నంబారు అప్పారావు శనివారం ఉదయం తన గూడ్స్ ఆటోలో కిరాయి నిమిత్తం అన్నవరం వైపు వెళ్తున్నాడు. బెండపూడి ఆర్‌టీఏ చెక్‌పోస్టు వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి వస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బలంగా ఢీకొట్టడంతో ఆటో బోల్తా పడింది. స్థానికులు ఆటోలో ఉన్న డ్రైవర్ అప్పారావును బయటకు తీశారు. ఆటో పూర్తిగా దెబ్బతినగా డ్రైవర్ అప్పారావు స్వల్ప గాయాలయ్యాయి. దీనిపై ఆటో డ్రైవర్ అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు.